కుర్చీ



"మన డైరెక్టరుగారికి ట్రాన్స్‌ఫరైందట" అని స్టెనో ముకుందం తన సూపర్నెంట్ రామలింగం చెవిలో చెప్పాడు. చెప్పి అతని కళ్ళలో కనిపించే కలవరం కోసం వెదికాడు. ముకుందం మాటలు విన్న రామలింగం క్షణకాలం అవాక్కయి తమాయించుకొని

"ఎవరు చెప్పారూ?" అనడిగాడు.

"ఎవరు చెబితేనేంగానీ చెప్పింది మాత్రం రిలయబుల్ సోర్సే" అని ఆయన పడుతూన్న అవస్థను చూచి నవ్వుకున్నాడు ముకుందం.

డైరెక్టరు సురేంద్రనాథ్‌కి ట్రాన్స్‌ఫరైందంటే రామలింగానికెంత విచారంగా ఉందో ముకుందానికంత సంతోషంగా ఉంది. తమ నాన్ గెజిటెడ్ అయినా తనపై అధికార్లని కాదని ఈ డైరక్టరు తననే పిలిచి ముఖ్యమైనపైళ్ళనిస్తూ ఉంటాడు. తన సామర్థ్యాన్ని గ్రహించిన డైరెక్టరీయనొక్కడే. ఈయనున్నప్పుడే తన ప్రమోషనుకడ్డొచ్చిన ఆ రూల్ ఏదో దాన్ని రిలాక్స్ చేయించుకుని, తాను గ్రాడ్యుయేటు కాకున్నా అసిస్టెంటు డైరెక్టరు ప్రమోషన్ సంపాదించాలని రామలింగం తపన. కానీ ఇప్పుడీయనకిలా మధ్యంతరంగా బదిలీ అయిందంటే అతనికి నిరుత్సాహంగా ఉండదా మరి?

ఇక ముకుందం సంగతి. ఇతనో సెకెండ్ గ్రేడు స్టెనో. రామలింగం సెక్షన్‌లో టైపిస్టు జాయింటు డైరెక్టరు రాజశేఖరానికి స్టెనో కూడానూ. అయితే ఇంతకు ముందున్న డైరెక్టరు అశోక్ అగర్వాల్ తనకు పియ్యే గానున్న అంబుజవల్లిని సస్పెండ్ చేస్తే ఆమె స్థానంలో ఇతను ప్రమోటై డైరెక్టరు పియ్యే అయ్యాడు. అగర్వాల్ వెళ్ళిపోయి ఇప్పుడున్న సురేంద్రనాథ్ వస్తూనే ఆయన తిరిగి అంబుజాన్ని డ్యూటీలోకి తీసుకున్నాడు. దాంతో ముకుందానికి రివర్సొచ్చింది. అందుకే సురేంద్రనాథ్ అంటే అతనికి కోపం. ఇప్పుడీయన వెళ్ళిపోతున్నాడంటే సంతోషం.

మరి అంబుజం సంగతేమిటి? అంటే ఆమె ఒక స్పెషల్ గ్రేడ్ స్టెనో. ఆఫీసు మొత్తంలో ఆ పోస్టుండేది ఒక్కటే. వచ్చిన ప్రతి డైరెక్టరుకీ ఆమే పి.యే. తమ డైరెక్టరు పియ్యే అవటం మూలాన్నో ఏమో గానీ ఆమెకు రవ్వంత గర్వం. నిర్లక్ష్యం కూడానూ. వీటి వల్ల ఆమె తరుచూ ఇబ్బందుల్లో పడుతూ ఉంటుంది. అశోక్ అగర్‌వాల్ స్వరద్రూపి. ఏ విషయాన్నయినా ఇట్టే గ్రహించగల వ్యక్తి. దర్పం, నిర్లక్ష్యం అంటే ఆయనకసలు పడదు. అందుకే అప్పుడప్పుడూ ఆయన అంబుజాన్ని చీవాట్లేస్తూ ఉండేవాడు.

ఒకసారి సచివాలయం నుంచి ఒక ఉత్తర మొచ్చింది. ఏదో ముఖ్యమైన విషయం గురించి ఫలానా రోజు శాఖాధిపతుల మీటింగుందనీ, దానికి హాజరు కమ్మనీ ఉందందులో అంబుజందాన్నందుకుని ఆ మీటింగు గురించి ఆయన ఎంగేజ్‌మెంటు ప్యాడ్‌లో రాసింది. అంతే. ఆతర్వాత దాన్నెక్కడ పెట్టిందోగానీ ఎంత వెదికినా దొరకనే లేదది. తర్వాత ఆమె దాని విషయాన్నే మరిచిపోయింది. తర్వాతెప్పుడో అది దొరికింది.

మీటింగురోజున దానికి హాజరై తిరిగొచ్చిన అశోక్ అగర్వాల్ అంబుజవల్లినికాక ముకుందాన్ని పిలిచి అంబుజవల్లి నిర్లక్ష్యంవల్ల తగిన సమాచారం తనకందనందువల్ల ఇతర శాఖల డైరెక్టర్లముందు తను తలదించేసుకోవలసొచ్చిందనీ, అందువల్ల ఆమెను సస్పెండు చేసి అసలా ఉత్తరం ఎలా పోయిందో విచారించవలసిందనీ, అందుకుగాను సీనియర్ జాయింటు డైరెక్టరైన రామకృష్ణను విచారణాధికారిగా నియమిస్తూ ఆర్డర్సు డిక్టేటు చేశాడు. అలా సస్పెండైన అంబుజం స్థానంలో ముకుంద్రావుకి ప్రమోషనొచ్చి డైరెక్టరు పియ్యే అయ్యాడు.

ఉన్న ఇద్దరు జాయింటు డైరెక్టర్లలో రామకృష్ణ సీనియర్. ఆయన తర్వాతే రాజశేఖరం. అవటానికి రామకృష్ణే సీనియర్ అయినా, డైరెక్టర్ పదవికి ఒక వేళ వస్తేగిస్తే తనే అర్హుడనన్న భావన రాజశేఖరానికుంది. ఆ పదవికోసం వీళ్ళిద్దరూ ఎవరికి వారు ప్రయత్నిస్తూనే ఉంటారెప్పుడూ! ప్రభుత్వం వారు మాత్రం ఎప్పటికప్పుడు బయటి వ్యక్తిని తెచ్చి డైరెక్టరుగా వేస్తూనే ఉంటారు.

అంబుజం సస్పెండయి ఆర్నెల్లయినా ఆమెపై విచారణింకా మొదలేకాలేదు. ఇన్ని రోజులు సస్పెన్షన్‌లో ఉండటం ఆమెకు తలతీసేసినట్టుగా ఉంది. ఎన్నాళ్ళని ఇలా? ఏదైనా చెయ్యాలి అని ఆలోచిస్తే తనక్కావలసిన లైటు వెలగడానికి స్విచెక్కడుందో ఆమెకు తెలిసొచ్చింది. వెంటనే వెళ్ళి రాజశేఖరాన్ని కలుసుకుంది. సాయం చెయ్యమని అర్థించింది. ప్రాధేయపడింది. భళ్ళున ఏడ్చింది. ఆయన ఏ కళనున్నాడోగానీ ఫోనెత్తి నంబరు తిప్పి రామకృష్ణతో అంబుజం విషయం చెప్పి "మీరిచ్చే రిపోర్టేదో త్వరగా ఇస్తేనే చేయవలసిన సాయం నేను చేస్తాను" అని ముగించేశాడు. ఈయన ఏకంగా రామకృష్ణకే ఫోన్ జేస్తాడని అంబుజం నిజంగా కలలో కూడా అనుకోలేదు. అలాంటిదాయన ఇలా ఫోన్ చేసేసరికి "అబ్బ. రాజశేఖరం గారెంత మంచివారు" అని ఆయన్ను మనసులోనే మెచ్చుకుంది. అంతేగానీ తనడిగిందే తడవుగా వీళ్ళిద్దరూ తనకు సాయం చేస్తామని ముందుకు రావడానికి ఎవరి కారణాలు వాళ్ళకున్నాయన్న విషయం ఆమెకు తట్టలేదు.

అంబుజం కేసును ఇన్ని రోజులు నానబెట్టావని తన ప్రత్యర్థికి ఎత్తిచూపడం రాజశేఖరానికున్న మొదటి కారణం. ఆమె తిరిగి డ్యూటీలో కొచ్చింతర్వాత తనకు విధేయురాలుగా ఉంటుందనేది రెండోది. అవసరమొచ్చినప్పుడు రామకృష్ణపై దెబ్బతీయడానికి ఈమె సాయం ఎంతైనా అవసరమన్నది మూడోది. ఆమె కేసు తన దగ్గరుంటే అంబుజం వెళ్ళి రాజశేఖరాన్నాశ్రయించటం రామకృష్ణకేమాత్రం నచ్చలేదు. కానీ తనామెకు విరుద్ధంగా రాస్తే రాజశేఖరం వెళ్ళి డైరెక్టరు దగ్గర దాన్ని తిప్పేయించవచ్చు. ఆయన దగ్గర అతనికంత పలుకుబడుంది మరి. అంచేత తనే ఆమెకు సుముఖంగా రాస్తే ఇటు అంబుజం విధేయతనూ పొందవచ్చు. అటు ఈ కేసులో న్యాయం చేశాడన్న మెప్పునూ ఇతర సిబ్బంది దగ్గరా పొందవచ్చు. పైగా అవసరమైనప్పుడు అంబుజం తనకెలాగూ సాయం చేస్తుంది. ఇవీ రామకృష్ణ ఆలోచన్లు, ఎలాగైతేనేం ఒక వారం రోజుల్లో రామకృష్ణ విచారణ పూర్తయిందనిపించి తన రిపోర్టిచ్చేశాడు. ఆయన తన రిపోర్టులో పోయిన ఉత్తరం దొరికిందనీ అంబుజం చేసింది ఏ మంత పెద్ద తప్పుకాదనీ చేసిన ఆ చిన్న తప్పుకు ఇన్ని రోజులూ సస్పెన్షన్‌లో ఉండి ఆమె అనుభవించిన వ్యథ సరిపోతుందనీ, అందుకోసం ఆమెను తిరిగి పనిలోకి తీసుకోవచ్చనీ రాశాడు. ఆ ఫైలు పరిపాలనా విభాగం నుంచి డైరెక్టరుకు చేరితే ఆయన దాన్ని చదువుకొని రాజశేఖరంను పిలిచి "దీన్నేం చేయ్యంమంటారో చెప్పం"డని ఆ ఫైల్ని ఆయనకందించాడు. రాజశేఖరందాన్నందుకుని పేజీల్నిటూ అటూ తిప్పి.

"చూశాను సార్ ఈ ఫైల్ని. కాని ఇదేం రిపోర్టు సర్. ఇన్ని రోజులుంచుకుని రామకృష్ణగారిలాంటి రిపోర్టిస్తారని నేననుకోలేదు. ఇంత ముఖ్యమైన విషయంలో నిర్లక్ష్యం చేసి మీటింగులో మీకు మొహం చెల్లకుండా చేసిన వ్యక్తిని ఏ శిక్షలేకుండా వదిలెయ్యటమా! ఇహ మీ హోదాకీ, వ్యక్తిత్వానికీ గౌరవమేముంటుంది? అదీగాక ఆఫీసులో డిసిప్లిన్నెలా మెయిన్‌టెన్ చెయ్యగలం సార్" అని ఆ ఫైల్ని తిరిగి ఆయన ముందుంచాడు. అప్పుడాగదిలో మూడో వ్యక్తెవరూలేరని నిర్ధారించుకున్న తర్వాత ఆయనామాటల్నన్నాడు. అయినా గోడలకి చెవులుంటాయి!

"ఇట్సాల్ రైట్. థాంక్యూ" అని ఆయన్ని పంపించేశాడు అగర్వాల్.

అయినా రాజశేఖరం అలా ఎందుకన్నారూ? తనేగా అంబుజానికి సాయం చేయమని రామకృష్ణనడిగింది. అంటే అంబుజం ఆయన్ను ఆశ్రయించిందని తెలుసుకుని ముకుందంతోనూ వెళ్ళి ఆయనకు సాష్టాంగం పడిపొయ్యాడు. మొన్నటిదాకా తన స్టెనోగానున్న ముకుందం అంటే ఆయనకు సానుభూతి ఎక్కువ. పైగా ఇంతకన్నా ముఖ్య కారణం మరోటుంది. డైరెక్టరు గనుక ఆ రిపోర్టును యథాతథంగా ఒప్పుకుంటే అంబుజానికి మేలుచేసిన ఘనతంతా రామకృష్ణకే దక్కుతుంది. ఆమెకు తన ప్రాముఖ్యత తెలిసిరాదు. అదే ఆమెకు ఏ నాలుగింక్రిమెంట్లు ఆపివేయటమో లేదా రివర్షివ్వటమో జరిగితే అంబుజం మళ్ళీ తననాశ్రయిస్తుంది. అప్పుడు తనామెను ఒకిటికి నాలుగుసార్లూ తిప్పించుకుని సాయం చెయ్యొచ్చు. అప్పుడుగానీ తన ప్రాముఖ్యత అంబుజానికి తెలీదు.

సరే. అంబుజం రివర్షనార్డర్సుతో ఫైలు తిరిగి రావటం. ఆమె స్థానంలో ముకుందం కొనసాగటం, అతని స్థానంలో ఆమె రాజశేఖరం స్టెనో కావటం జరిగిపొయ్యాయి.

ప్రతిసారీ బయటివారెవరో వచ్చి డైరెక్టరు పదవి నాక్రమించటం ఇద్దరు జాయింటు డైరెక్టర్లకీ కంటకంగానే ఉంది. తమ డిపార్టుమెంటులో పుట్టి పెరిగినా డైరెక్టరయ్యే యోగం ఇద్దర్లో ఎవరికీ ఉన్నట్టు కనిపించడంలేదు. అయినా ఎవరికి తోచిన ప్రభుత్వాల్ని వాళ్ళు చేస్తూనే ఉన్నారు.

ఒకరోజు ఉదయాన్నే ఎవ్వరూ ఊహించిన విధంగా సురేంద్రనాథ్ రావడం. ఛార్జీ తీసుకోవడం, అశోక్ అగర్వాల్ వెళ్ళిపోవటం జరిగింది. అప్పటికింకా రామకృష్ణ ఆఫీసుకే రాలేదు. ఒచ్చిన ఆ కొత్తాయనకు రాజశేఖరం ఈ ఆఫీసుకు గురించీ ఆఫీసర్ల గురించీ బ్రీఫింగ్ ఇచ్చాడు. ఇలా ఇవ్వడంలో ఆయన తన సామర్థ్యాన్ని చెప్పకనే చెప్పుకన్నాడు. అప్పుడే సురేంద్రనాథ్ ఎందుకైనా మంచిదని ఈయనమీదొక కన్నువేసుంచాలని నిర్ణయించుకున్నారు.

ముకుందరావు ఒక రోజు టైపు చేస్తూ చేస్తూ ఏదో జ్ఞాపకమొచ్చి ఫోనెత్తి "సార్. డైరెక్టరుగారు మిమ్మల్నొకసారి రమ్మంటున్నారని" రాజశేఖరంకి చెప్పి మళ్ళీ టైపు చేయటంలో నిమగ్నమయ్యాడు. ఎంతలా నిమగ్నమయ్యాడంటే రాజశేఖరం తన ముందు నుంచే డైరెక్టరు గదిలోకెళ్ళటంగానీ, తిరిగి తన ముందునుండే వెళ్ళిపోవడంగానీ అతను గమనించనేలేదు. తనొచ్చిన ప్రతిసారీ నమ్రతగా లేచి మల్చుని నమస్కారంచేసే ముకుందం ఇప్పుడిలా నిర్లక్ష్యంగా ఉండటం చూచి ఆయన మెదడులో ఒక స్విచ్చు క్లిక్‌మనంది.

తన గదిలోకెళ్ళిన రాజశేఖరం అంబుజాన్ని పిలిచి డిక్టేషనివ్వటం మొదలెట్టాడు. ప్రస్తుత ప్రభుత్వం పదవిలోకొచ్చి సంవత్సరకాలమైన సందర్భంగా జరుపవలసిన ఉత్సవాల్లో భాగంగా ఈ డిపార్టుమెంటు ఒక బహిరంగ సభని జరుపవలసుంది. ఆ సభలో ఇప్పటి ప్రభుత్వం సాధించిన విజయాల్ని ప్రజలకు తెలియజెయ్యాలి. అందులో మాట్లాడవలసిన వక్త పేర్లున్న లిస్టుని తయారుచేయమని సురేంద్రనాథ్ రాజశేఖరానికి చెప్పాడు. ఆ లిస్టునే డిక్టేటు చేస్తున్నాడాయన. డిక్టేషన్ తీసుకుంటున్న అంబుజం కళ్ళు తళుక్కున మెరిసి "సర్! ఎన్నాళ్ళని మీరిలా జాయింటు డైరెక్టరుగానే...." అనంటూండగానే ఆయన లేచి వెళ్ళి తలుపేసి బయటకున్న ఎర్రలైట్ని వెలిగించాడు. అది వెలిగితే లోపలికెవ్వరూ రారు. ఒక అరగంట తర్వాత ఆలైటు ఆరిపోయింది. నవ్వుతూ అంబుజం బయటికొచ్చింది.

ఆ మర్నాడే అంబుజం తన రీప్రమోషన్ కోసం అప్పీలు పెట్టుకుంది. నిమిషాల మీద ఆమె ఫైలు కదలటం, రాజశేఖరం దాన్ని పట్టుకెళ్ళి డైరెక్టరుగారితో చర్చించి ఆర్డర్లు వేయించుకురావడం జరిగిపొయ్యాయి. అంబుజం మళ్ళీ డైరెక్టరుగారి పియ్యే అయితే ముకుందానికి రివర్షనొచ్చింది. రాజశేఖరం మెదడులో అప్పుడు వెలిగిన బల్బు ఇప్పుడు మళ్ళీ క్లిక్‌మని ఆరిపోయింది.

బహిరంగ సభ జరగవలసిన రోజున అంబుజం డైరెక్టరుగారి గదిలోకెళ్ళి ఆయనతో గుసగుసలాడింది. మీటింగుకు ముందు డైరెక్టరు తన గదిలో ఆనవాయితీగా వక్తలకు తేనీటి విందునిచ్చాడు. ఆ విందులో ఆయన సూక్ష్మంగా వారికో సందేశాన్నందించారు. వాళ్ళు దాన్ని గ్రహించారు. ఈ విందులోగానీ, ఆ తర్వాత జరిగే బహిరంగ సభలోగానీ రాజశేఖరం లేడు. డైరెక్టరు పురమాయిస్తే ఏదో పనిమీద ఢిల్లీ వెళ్ళాడు. సభ జరిగిన మర్నాడుగానీ ఆయన తిరిగిరాలేదు.

ఆయన తిరిగొచ్చిన మర్నాడే ఆఫీసులో ఒక వదంతి బయలు దేరింది. అదేమంటే డైరెక్టరు సురేంద్రనాథ్‌కి ట్రాన్స్‌ఫైరందని. ఈ వదంతులెలా బయలుదేరుతాయో మనందరికీ తెలుసు. అతి సహజంగా గద్ద ఎగిరితే అతి విడ్డూరంగా గేదె ఎగిరిందన్న వదంతి బయలుదేరుతుంది. అలాంటిదే ఇదీనూ. ఈ వదంతినే ముకుందం రామలింగానికి చెప్పి ఆయన్ని హైరానా చేశాడు. ఈ వదంతికి మూలం ఎక్కడుందంటే ఆ రెడ్ లైటు వెలిగి ఆ గదిలో రూపుదిద్దుకున్న వ్యూహంలో ఉంది. అంబుజం సలహా మేరకు సభలో మాట్లాడవలసిన వక్తల పేర్లలో ప్రభుత్వ విధానాలంటే గిట్టని మేధావుల పేర్లనీ చేర్చాడు రాజశేఖరం. ఎప్పుడూ అధికార వర్గంలోనే తిరిగే ఈ కొత్త డైరెక్టరుకి సమాజంలోని వివిధ వర్గాల్లో ఉన్న మేధావుల గురించేమీ తెలియదు. ఆయనకు తనమీద పూర్తి నమ్మకముంది గనుక తనెవరి పేర్లను సూచించినా ఆయన ఒప్పేసుకుంటాడు. బహిరంగసభలో వీళ్ళెలాగూ ప్రభుత్వాన్ని దుయ్యబడతారుగనుక ఇలాంటి వక్తల్ని ఎన్నిక చేసినందుకు ఈ డైరెక్టరు కెలాగూ ఉద్వాసన తప్పదు. అప్పటికే తమ లాగవలసిన దారాలన్నింటినీ లాగుంచాడు గనుక ఆ పదవి ఇప్పుడు తనకు దక్కటం ఖాయం. ఎర్రలైటు వెనక ఆయన వేసిన పథకం ఇది. కానీ ఈ పథకమంతా డైరెక్టరుగారిచ్చిన తేనీటి విందులో కొట్టుకుపోయిందని ఆయనకు తెలీదు!

మర్నాడు డైరెక్టరు రాజశేఖరాన్ని పిలిచి ఒ కవరందించాడు. అది తన ప్రమోషనార్డరే అనుకుని సంతోషపడిపొయ్యాడాయన. తీరా తీసి చూస్తే అది తన ట్రాన్స్‌ఫర్ ఆర్డరు.

అంబుజం కక్ష ఈ విధంగా తీరింది. ఏ స్విచ్చునొక్కితే ఏ లైటు వెలుగుతుందో ఆమెకు తెలుసు మరి!

టి. రామాచారి